క్లుప్తంగా

టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వండి

ఊట్కూర్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎవరైన అక్రమంగా మద్యం తరలించడం, నిల్వ చేయడం చేస్తే ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం 18004252523 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని గురువారం ఎక్సైజ్ సీఐ కవిత గురువారం ఒక ప్రకటనలో కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గుప్తంగా ఉంచుతామని 24గంటలు టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా సురేష్



ఊట్కూరు: మండల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్‌గా పి సురేష్‌కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేట తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివశ్రీనివాస్, ఆర్ఐ రాఘవేందర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మరికల్: నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న, నాయకులు కృష్ణయ్య, సూర్యమోహన్ అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి పర్ణికారెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలను అమలుచేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో హరిష్, మొగులప్ప, రామకృష్ణ, నరహరి, విజయ్‌కుమార్‌రెడ్డి, జయసింహరెడ్డి, హన్మంతు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ నాయకుల సమావేశం

నర్వ: మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్ తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండల కార్యవర్గ సభ్యులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా, యూత్ విభాగాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, బూత్ కమిటీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు హాజరు కావాలన్నారు. నియోజకవర్గంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగరవేసేందుకు కృషిచేయాలన్నారు.

కంటి వైద్యశిబిరం



కోస్గి: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, లయన్స్‌క్లబ్ కోస్గి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గురువారం నిర్వహించిన ఈ శిబిరంలో కంటి వైద్యులు భాస్కర్‌గౌడ్ 50మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 25మందికి కంటిలో శుక్లాలు గుర్తించారు. కంటి శుక్లాలు ఉన్న వారికి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని లయన్స్ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బెజ్జు వెంకట్రాములు, కోశాధికారి కొటాల్ శంకర్, ప్రతినిధులు వెన్న శేఖర్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జలంధర్‌రెడ్డి ఎంపికపై హర్షం

ఊట్కూర్: మక్తల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా జలంధర్‌రెడ్డిని ఎంపిక చేయడంపై పగిడిమారి బీజేపీ అధ్యక్షుడు అశోక్, భీరెండ్డి గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆయా గ్రామంలో కార్యకర్తలకు, అభిమానులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి



దామరగిద్ద: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న నరమేధాన్ని ఆపాలని, పాలస్తీనాలో శాంతిని నెలకొల్పాలని గురువారం మండలంలోని సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు.. సీపీఎం మండల కార్యదర్శి గోపాల్, అంజిలయ్యగౌడ్ మాట్లాడుతూ.. గత 25 రోజులుగా పాలస్తీనాను ఆక్రమించి అక్కడి ప్రజానీకాన్ని దేశం నుంచి వెళ్లగొట్టాలని దాడులు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మహేష్, శివకుమార్, హన్మంతు, ప్రకాష్, బాల్‌రాజ్, మహేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలతో ఇక్కట్లు

- నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ
- దుమ్ము, ధూళితో ప్రజల అవస్థలు
- మామూళ్ల మత్తులో అధికారులు



పంట పొలాల పక్కన ఉన్న ఇటుకల బట్టీలకు బూడిదను డంపు చేస్తున్న లారీ

కృష్ణా: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన బట్టీలతో అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాలు, వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసిన బట్టీల నుంచి వెదజల్లే దుమ్ము, ధూళితో ప్రజలు, రైతులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇటుక బట్టీల ఏర్పాటుకు సంబంధించి ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి అధికారులు అనుమతి ఇస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయానికి పనికి రాని పొలాలను బట్టీల ఏర్పాటుకు అనుమతించాల్సి ఉండగా.. ఇక్కడ మాత్రం వ్యవసాయ పొలాల్లోనే యథేచ్ఛగా ఏర్పాటు చేస్తున్నారు. పైగా ఇటుకల తయారీకి సమీపంలోని నోటిఫైడ్ చెరువుల నుంచి విలువైన ఒండ్రు మట్టిని అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అన్ని బట్టీలు మహారాష్ట్ర వారివే..

మండలంలోని హిందూపూర్ నుంచి యాద్గీర్ రోడ్డు వెంట వందల ఎకరాల్లో ఇటుక బట్టీలను మహారాష్ట్రకు చెందిన కాంట్రాక్టర్లు ఏర్పాటు చేసుకున్నారు. వీటి నిర్వాహణకు స్థానిక అధికారులు అండగా నిలవడం, బట్టీలకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలను కల్పించడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలు అన్నవిధంగా కొనసాగుతోంది. బట్టీలలో వేలమంది వలస కార్మికులు పని చేస్తుండగా, వందల సంఖ్యలో వారి పిల్లలు కూడా పనుల్లో ఉంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల నిర్వాహకులపై చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పంటలకు నష్టం వాటిల్లుతుంది..



పంటపొలాల పక్కన ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడంతో పంటలకు నష్టం వాటిల్లుతుంది. విషయాన్ని బట్టీల యజమానులకు చెబితే పట్టించుకోవడం లేదు. స్థానిక రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

–బాలు రైతు, గుడెబ్లూర్

ఆందోళన చేపడతాం..



బట్టీల ఏర్పాటుతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులతో కలిసి త్వరలోనే ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తాం. ఈ విషయంపై ఇప్పటికే బాధిత రైతులతో మాట్లాడటం జరిగింది.

– శాంతప్ప రైతు, గుడెబల్లూర్

బట్టీలపై విచారణ చేస్తాం..

మండలంలోని ఇటుకల బట్టీలపై విచారణ చేస్తాం. వాటికి అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయంపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఎన్నికల విధుల్లో ఉండటంతో వాటిపై దృష్టి సారించలేకపోతున్నాం.

– దయాకర్‌రెడ్డి, తహసీల్దార్, కృష్ణా

బీఎస్పీకి అవకాశం కల్పించండి



పార్టీలోచేరిన వారికి కండువాలు కప్పుతున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

నర్వ: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీని గెలిపిస్తే మక్తల్ నియోజకవర్గంలో అభివృద్ధి చేసి చూపిస్తానని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. మండలంలో ప్రచారం నిమిత్తం ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిపిస్తే రెండున్నర ఏళ్లలోనే అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గంలో రెసిడెన్షియల్ విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు బీఎస్పీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు అర్జున్‌రాజ్, మండల బీఎస్పీ అధ్యక్షుడు పుత్రసేన తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న సర్పంచ్

మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కీ.శే సూరిటి అనూరాధ జ్ఞాపకర్థంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు గురువారం బహుమతులను అందజేశారు. మొదటి విజేత కొల్లంపల్లి జట్టుకు రూ.10,116, రెండోబహుమతి గెలుపొందిన మరికల్ జట్టుకు రూ.5.116 మెమోంటోలను సర్పంచ్ గోవర్ధన్ అందజేశారు. కార్యక్రమంలో రాజేష్, రాములు, శ్రీనివాసులు, రామన్‌గౌడ్, రవికిరణ్, శేఖర్, ఆంజనేయులు, శ్రీకాంత్, బుచ్చన్న, సురేష్, మహేందర్, మన్సూర్ పాల్గొన్నారు.

భక్తులకు మరింత సౌకర్యార్థం



ఊకచెట్టువాగుపై పూర్తయిన కాజ్‌వే

కురుమూర్తికి వెళ్లేందుకు పూర్తయిన కాజ్‌వే, బీటీ రోడ్డు



బ్రిడ్జి పూర్తికాక ముందు ఊకచెట్టువాగులో నుంచి వస్తున్న భక్తులు (ఫైల్)

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఈ సారి ఊకచెట్టువాగులో ఇబ్బందులు తప్పనున్నాయి. 2020లో ఊకచెట్టువాగుపై కాజువే నిర్మాణం, కురుమూర్తి స్వామి ఆలయం వరకు బీటీ, ఘాట్‌రోడ్డు నిర్మాణానికి రూ.41 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. అధికారులు పనులను ప్రారంభించి ప్రస్తుతం కాజ్‌వే, స్వామివారి ఆలయ జాతర మైదానం వరకు బీటీ రోడ్డు పూర్తి చేశారు. దీంతో ఈ సంవత్సరం రాయచూరు, నారాయణపేట జిల్లాలతో పాటు, మక్తల్, నర్వ, అమరచింత, ధన్వాడ, మరికల్ మండలాలనుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

ఏళ్లుగా ఇబ్బందులు..

ఊకచెట్టువాగుపై కాజ్‌వే లేకపోవడంతో ప్రతి ఏడాది కురుమూర్తి ఉత్సవాలకు వచ్చే భక్తులు తీవ్ర ఇబందులకు గురయ్యేవారు. అప్పట్లో అల్లిపురం సమీపంలో మాత్రమే ఊకచెట్టువాగుపై వంతెన ఉండేది. దీంతో వర్షాకాలం వస్తే వాగులో కోయిల్ సాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు వదిలే నీటి వరద ఉధృతికి వాగు నిండుగా పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, బైకులు దాటే సమయంలో ఎన్నో ప్రమాదాలు సంభవించేవి. ఆలయానికి రావాలంటే 25 కిలో మీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వచ్చేది. అంతేకాక రాయచూరు, కొత్తకోట జాతీయ రహదారికి దగ్గర దారి కావడంతో వాహనదారులు ఎక్కువగా ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. ఊకచెట్టువాగుపై కాజ్‌వే నిర్మాణం, కురుమూర్తి స్వామి ఆలయం వరకు బీటీరోడ్డు వేయడంతో కురుమూర్తి స్వామి భక్తులతోపాటు వాగు అవతలి, ఇవతలి గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పాయి.

ఇబ్బందులకు గురయ్యాం



కురుమూర్తిస్వామి ఉత్సవాలకు అమరచింత మండలం నుంచి వచ్చే భక్తులు చిన్నచింతకుంట ఊకచెట్టువాగులో తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. వాగులో వరదనీరు ఉన్నపుడు 25 కిలో మీటర్ల దూరం అదనంగా అల్లిపురం బ్రిడ్జి పైనుంచి వెళ్లాల్సి వచ్చేది. గంట, రెండు గంటల సమయం అదనంగా పట్టేది. ఇప్పుడు కాజ్వే నిర్మాణం చేపట్టడంతో స్వామి వారి ఉత్సవాలకు రావడానికి ఇబ్బందులు ఉండవు. 30 నిమిషాల్లో ఆలయానికి చేరుకుంటాం.

– నర్సింహులు, అమరచింత

ఇబ్బందులు తప్పాయి



ఏటా కురుమూర్తి జాతరకు నర్వ, మక్తల్, మరికల్, ధన్వాడతో పాటు నారాయణపేట జిల్లా నుంచి భక్తులు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లపైన వచ్చేవారు. వాగులో వాహనాలు దిగబడి ఇబ్బందులకు గురయ్యేవారు. కాజ్‌వే నిర్మాణం పూర్తి కావడంతో భక్తులకు ఈ సంవత్సరం అలాంటి ఇబ్బందులు ఉండవు.

– ప్రతాప్‌రెడ్డి, కురుమూర్తి స్వామి ఆలయ కమిటీ చైర్మన్

బాధిత కుటుంబానికి పరామర్శ



మరికల్: మండలంలోని వెంకటాపూర్‌లో తేనే టీగల దాడిలో గురువారం మృతి చెందిన బద్దిపల్లి వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకులు కుంభం శివకుమార్‌రెడ్డి పరామర్శించారు. మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు. అలాగే ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వారిని పర్మారించారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, అంజిరెడ్డి, హరీష్, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం తొలగించాలని కలెక్టర్‌కు వినతి



చిన్నచింతకుంట: మండలంలోని ఊకచెట్టువాగుపై నిర్మించిన చెక్‌డ్యాంను తొలగించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు, అసెంబ్లీ కన్వీనర్ కుర్వరమేష్ గురువారం కురుమూర్తి స్వామి ఆలయం వద్దకు వచ్చిన కలెక్టర్ రవినాయక్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చెక్‌డ్యాంతో గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెక్‌డ్యాం సమీపంలో ఉన్న శ్మశానవాటికలోకి చెక్‌డ్యాం నీరు చేరి దుర్గంధం వెదజల్లుతుందన్నారు. గ్రామానికి చెక్‌డ్యాం దగ్గరలో ఉండడంతో కుక్కలు, పందులు అందులో పడి మృతి చెందుతున్నాయన్నారు. ఈ చెక్‌డ్యాం నుంచే గ్రామానికి తాగునీరు అందుతుండడంతో ఆనీటిని తాగి ప్రజలకు పలురోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

ముస్లిం రిజర్వేషన్లను గాలికొదిలేశారు..



ఆత్మకూర్: అధికారంలోకి వచ్చిన వెంటనే 12శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామిచ్చిన కేసీఆర్ పదేళ్లు అవుతున్న హామిని గాలికొదిలేశారని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు అన్నారు. గురువారం ఆత్మకూర్‌కు చెందిన మహమ్మద్, గయాసుద్దీన్‌ను ముస్లిం జాయింట్ యాక్షన్‌కమిటీ వనపర్తిజిల్లా కన్వీనర్‌గా నియమిస్తు హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ సయ్యద్‌సలీంపాష, రాష్ట్ర కో కన్వీనర్ షైకబాబు నియమాక పత్రం అందజేశారన్నారు. స్వాతంత్య్రం సిద్ధించిన నాటిననుంచి నేటివరకు ముస్లింల బతుకులు ఎక్కడవేసిన గొంగడిఅక్కడే అనే చందంగా మారిందని, ముస్లింలను కేవలం ఓటుబ్యాంకుగా మార్చుకోవడమే రాజకీయ నాయకులు పనిగా పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని లక్షలకోట్లు విలువ చేసే వేలాది ఏకరాల వక్ఫ్‌భూములు అన్యాక్రాంతమవుతున్న పట్టించుకోవడం లేదని, ముస్లింలకు అన్యాయం చేస్తున్న రాజకీయ పార్టీలకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తనను జిల్లా కన్వీనర్‌గా నియమించిన కమిటీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతూ ముస్లిం సమాజాన్ని మేలుకొలుపేందుకు కృషిచేస్తానని గయాసుద్దీన్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి



మాట్లాడుతున్న సీతాదయాకర్‌రెడ్డి

మక్తల్: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు తనవంతు కృషిచేస్తామని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా దయాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అభిమానులు, కార్యకర్తలతో అభిప్రాయసేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని, దయాకర్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఎలా ఉంటున్నారో అదేవిదంగా అభిమానులు, కుటుంబ సభ్యులందరు పార్టీ గెలుపునకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. పార్టీ మేనిఫెస్టో, సంక్షేమ పథకాల వివరాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మక్తల్ నియోజకవర్గ అభ్యర్థి వాకిటి శ్రీహరి గెలుపునకు కృషిచేయాలన్నారు. అనంతరం మక్తల్ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. సమష్టి కృషితో పార్టీని ముందుకు తీసుకెళ్దామని, అందరినీ కలుపుకొని పనిచేస్తానని అన్నారు. ఈక్రమంలో మక్తల్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎంపీపీ మణెమ్మ, సిదార్థరెడ్డి, జగదబిరెడ్డి, బస్వరాజ్, రవీందర్, తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యమ కారులకు ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మద్దూరు: తెలంగాణ సాధనకోసం పార్టీ ఎదుగుదలకు కృషి చేసినా ఉద్యమకారులను ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి విస్మరించారని బీఆర్ఎస్ మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి సతీష్ అన్నారు. గురువారం కొత్తపల్లి మండల కేంద్రంలో ఉద్యమ కారులతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు.. ఉద్యమ కాలంలో చురుకుగా పనిచేసినా వారికి ఏలాంటి పదువుల ఇవ్వలేదన్నారు. పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే తమ సత్తా ఎమిటో చూపిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉద్యమకారులు శివశంకర్, నారాయణరెడ్డి, మునీర్, రఫీ, సాయిరెడ్డి, వెంకటేష్, రామచారి, భీంసెన్, గోవింద్, కృష్ణయ్య, నరేష్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక..



బీజేపీ కండువా కప్పుతున్న రతంగ్‌పాండురెడ్డి

ధన్వాడ: బీజేపీ జిల్లా గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ చవాన్ బుధవారం ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో కండువా కప్పుకోగా తిరిగి గురువారం జిల్లా కేంద్రంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రతంగ్‌పాండురెడ్డి సమక్షంలో కండువా కప్పుకున్నారు. ఈ మేరకు.. రతంగ్‌పాండు రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ కార్యకర్తలను బయపెట్టి బలవంతంగా బీఆర్ఎస్‌లో చేర్పిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేందర్, జిల్లా నాయకులు నర్సింహులు, రఘురామయ్యగౌడ్, గోవర్ధన్‌గౌడ్, మొహబూబ్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..



మక్తల్‌లో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి

నారాయణపేట: మండలంలోని లింగంపల్లి, పిల్లిగుండ్లతండాలో బీఆర్ఎస్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి 40మంది చేరడంతో వారికి డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డికి హస్తం గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. నారాయణపేట నియోజకవర్గ అభివృద్ధికి అన్నివిధాలుగా బాటలు వేస్తామన్నారు.

మక్తల్: నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చిన తాను ఆదుకుంటానని అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం పట్టణంలో ఆయన నివాసంలో మక్తల్‌కు చెందిన వివిధ పార్టీల నుంచి వందమంది కార్యకర్తలు, నాయకులు వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కాండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో మక్తల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. అలాగే మక్తల్ మండలంలోని ఎర్నాన్‌పల్లికి చెందిన వివిధ పార్టీలకు చెందిన కార్యమకర్తలు శ్రీహరి సమక్షంలో 50మంది కార్యకర్తలు చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హన్మంతు, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్, కావలి తాయప్ప, నాగప్ప, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో ఆహ్వానిస్తున్న కుంభం శివకుమార్‌రెడ్డి

మాగనూర్: మండల పరిధిలోని తళంకేరికి చెందిన యువకులు గురువారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో నర్సింహులు, తాయప్ప, రామకృష్ణ, అంజప్ప, శ్రీనివాస్, మహేష్, బాలరాజ్, బాబు, శ్యాం పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు దండు ఆనంద్, వేణుగౌడ్ పాల్గొన్నారు.

జోరుగా బీఆర్ఎస్ ప్రచారం



పేటలో బీఆర్ఎస్ తరపున ఇంటింటి ప్రచారం చేస్తున్న స్వాతిరెడ్డి



మరికల్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నారాయణపేట రూరల్ : నియోజకవర్గానికి ఎస్ఆర్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఫలాలే తిరిగి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని ఆయన సతీమణి స్వాతిరెడ్డి అన్నారు. పట్టణంలోని 3, 17వ వార్డుల్లో బుధవారం ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గందె అనసూయ, వైస్ చైర్మన్ హరినారాయణ్‌బట్టడ్, మార్కెట్ చైర్మన్ జ్యోతి, పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్, సుదర్శన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చెన్నారెడ్డి, నారాయణమ్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ కార్యకర్తలు ఓటర్లను కోరారు. గురువారం పట్టణంలో వివిధ వార్డుల్లో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహాగౌడ్, శివారెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని మాధవరం, రాకొండ, పెద్దచింతకుంట, పస్పుల, ఎలిగండ్ల, అప్పంపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని మూడోసారి గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, వైస్ ఎంపీపీ రవి, రాజేష్, కృష్ణారెడ్డి, రామస్వామి, తిరుపతయ్య, బసంత్, లక్ష్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరాయని బీఆర్ఎస్ యువనాయకుడు చిట్టెం చాణిక్యరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వర్కూర్, నేరడగండొడ్డి నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటయ్య, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, వైస్ఎంపీపీ తిప్పయ్య, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, లక్ష్మికాంత్‌గౌడ్, మల్‌రెడ్డి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని దామరగిద్ద, కాన్‌కుర్తి, కంసాన్‌పల్లి, వత్తుగుండ్ల, క్యాతన్‌పల్లి, బాపన్‌పల్లి, లింగారెడ్డిపల్లి, విఠలపూర్, ఉడ్మల్‌గిద్ద ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం చేశారు. కారుగుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్ రాజేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సప్ప, విండో అధ్యక్షుడు ఈదప్ప, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్, తిప్పన్న, కిషన్‌రావు, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శరణప్ప, బసంత్‌రాజ్, బసంత్‌రెడ్డి, అశోక్‌గౌడ్, కృష్ణయ్య, పరుషురాంరెడ్డి, కిష్టారెడ్డి, శ్రీనివాస్‌శెట్టి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూచిక బోర్డు ఏర్పాటుచేయాలి

మాగనూర్: మండలంలోని గురువలింగంపల్లి, తళంకేరి గ్రామాలకు వెళ్లు దారిలో ఏర్పాటుచేసిన సూచికబోర్డు నిరుపయోగకరంగా పడి ఉంది. అయితే ఈ దారిలో కొత్తగా వచ్చేవారికి గ్రామ సూచికబోర్డు లేకపోవడంతో ఏటు వెళ్లాలో అర్థంగాక మరోదారిలో ఉన్న కొత్తపల్లి గ్రామానికి డైరెక్ట్ వెళ్లిపోతున్నారు. దీంతో సమయం వృథా కావడంతోపాటు పనులు కూడా ఆలస్యమవుతున్నాయని వాపోతున్నారు. బోర్డులు ఏర్పాటుచేసి కొంతకాలమైన అప్పుడే ఇలా కావడంపై సర్వత్రవిమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే కొన్నిచోట్ల సూచిక బోర్డులు కూడా పడిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.